www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 8 నవంబర్ 2025
5
తిరుపతి



ధ్వనించిన వందేమాతర స్ఫూర్తి



ప్రజాశక్తి -తిరుపతి సిటీ

భారత దేశ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశభక్తి గీతం "వందేమాతరం" 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సిబ్బందితో కలిసి "వందే మాతరం" గీతాన్ని ఆలపించారు. ఎస్పీ మాట్లాడుతూ "వందేమాతరం కేవలం ఒక గీతం మాత్రమే కాదని, అది మన తల్లి భారత మాత పట్ల ఉన్న భక్తి, గౌరవం, త్యాగం, దేశ సేవాస్ఫూర్తికి ప్రతీక అన్నారు. ఈ గీతం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచింది. ప్రతి భారతీయుని హృదయంలో 'వందేమాతరం' అనే మాట ఒక భావోద్వేగ జ్వాలలా వెలిగిపోవాలి," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, శ్రీనివాసులు, డీఎస్పీలు చంద్రశేఖర్, చిరంజీవి పాల్గొన్నారు.



బురదను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

బురదలోనే.. బతుకులు..!

తీరని నష్టం..అంచనా కష్టం



తల్లులు లేక అనాధలుగా దూడలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి/కేవీబీపురం

కూలిన గోడలు.. వాలిన చెట్లు.. జారిన వస్తువులు..కొట్టుకెళ్లిన వాహనాలు..గల్లంతైన మూగ జీవాలు.. ఇవీ రాయలచెరువు గండి కళత్తూరు దళితవాడలో మిగిల్చిన కన్నీటి వ్యథలు. ఇళ్లంతా బురదమయం..వొళ్లంతా మరకల గాయాలు.. ఏది ఎక్కడుందో తెలియక వెతుకలాట.. ఎవరో వస్తారని..ఏదో సాయం చేస్తారన్న ఆశ.. జారిపోతున్న బురదలోనే శుక్రవారం తెల్లవారుజామున బతుకుజీవనం ప్రారంభించారు. కొట్టుకుపోగా మిగిలిన వస్తువులను కాల్వలోని బురదనీటిలోనే శుభ్రం చేసుకుంటూ కనిపించారు. బట్టలు ఉతికి ఆరబెట్టుకుంటున్నారు. తాగడానికి, వండుకోడానికి గుక్కెడు నీరు లేక 'బతుకు జీవుడా' అంటూ ఎవరైనా ఆదుకుంటారేమోనని ఎదురుచూస్తూ కనిపించారు. బహుశా ఈ కళత్తూరు దళితవాడ ఈ వరద ముంపు నుంచి తేరుకోడానికి వారం రోజులైనా పడుతోంది.. పారిశుధ్య కార్మికులు బురదను టన్నులకొద్దీ నెట్టుకొస్తున్నారు. కళేబరాలు కుళ్లిపోయి ఆ ప్రాంతమంతా అపుడే వాసన ప్రారంభమయ్యింది. ప్రభుత్వ యంత్రాంగం యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టని పక్షంలో వ్యాధులు ప్రబలే అవకాశం లేకపోలేదు.ఇదంతా 'ప్రజాశక్తి' పరిశీలనలో కనిపించిన సర్వం కోల్పోయిన కళత్తూరు దళితుల దీనగాథ.

రాయలచెరువుకు గండిపడి ఉప్పెనలా ముంచుకొచ్చిన ముంపు నీరు ఐదు గ్రామాలను చుట్టుముట్టగా తీవ్రంగా నష్టపోయింది మాత్రం కళత్తూరు దళితవాడే. గ్రామంలో సుమారు 500 కుటుంబాలు నివాసం ఉండగా, 90 శాతం మందికి పాడి రైతులే ఆధారం. 10 శాతం మంది బీడీ కార్మికులుగా, మత్స్యకారులుగా జీవనం సాగిస్తున్నారు. లోతట్టు ప్రాంతంలో ఇల్లు నిర్మించుకోవడమే ఇక్కడ దళితులు చేసుకున్న పాపంగా మారింది. మెట్ట ప్రాంతంలో ఉన్న కళత్తూరు ఊరికి ఇసుమంతైన ముంపు నీరు తాకకపోవడం గమనార్హం. ప్రాణాలైతే దక్కించుకున్నాం గానీ, తాము ప్రాణంగా పెంచుకున్న



బాధితులను పరామర్శిస్తున్న వి.శ్రీనివాసరావు

గొడ్లు, గోదను మాత్రం కాపాడుకోలేక పోయామంటూ పలకరించిన ప్రతి దళితుడి గొంతుక నుంచి వినబడ్డ విషాదకర మాటలివి. విపత్తు విధ్వంసం సృష్టించి వెళ్ళిపోయి రెండు రోజులు గడుస్తున్నా నష్టాన్ని అంచనా వేయడం అధికారులకు కష్టంగా మారింది. ముఖ్యంగా జీవనధారమైన పాడి ఆవులు, గేదెలను కట్టేసి ఉంచడం వల్లే ప్రాణాలు కోల్పోయాయంటూ బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. విపత్తును తాము ఊహించలేకపోయామనీ, కట్లు విప్పేలోగే వరద ఉప్పెనలా చుట్టుముట్టిందనీ, చేసేది లేక డాబాల పైకెక్కి తమ ప్రాణాలు మాత్రం నిలుపుకున్నామంటూ బాధాతప్త హృదయాలతో బాధితులు చెప్పారు. కట్టేయని లేగదూడలు మాత్రం కొట్టుకెళ్లి అక్కడక్కడా చిక్కుకోవడంతో ప్రాణాలతో రక్షించగలిగామని చెప్పుకొచ్చారు. ఇప్పుడా లేగ దూడాలన్నీ తల్లుల్లేని అనాధలుగా మిగిలాయని 'ప్రజాశక్తి'తో వాపోయారు.

ఎవరాదుకుంటారు: సుశీలమ్మ



మాకున్న 30 ముర్రా జాతి గేదెలతో నా ఇద్దరు కొడుకులు దర్జాగా బతికేవారు. ఒక్కో గొడ్డు విలువ రూ. 70 వేల పై మాటే. మాయదారి వరదొచ్చి గొడ్లను మా ముందే మింగేసింది. దొడ్లోనే ఆరు గేదెలు చనిపోగా, మిగతావి ఏమయ్యాయో తెలియదు. మమ్మల్ని ఎవరాదుకుంటారు.

నా కొడుకు పెళ్ళాగిపోయేలా ఉంది: లోకయ్య, బీడీ కార్మికుడు



నా కొడుకు పెళ్లి కోసం దాచుకున్న రూ. 4 లక్షల నగదు వరదలో కొట్టుకుపోయింది. చుట్టిన బీడీలు, తయారీ సామాగ్రి అంతా కొట్టుకెళ్ళింది. వాటి విలువ రూ. 2.50 లక్ష పై మాటే. ఎంతో కొంత సాయపడుతుందని పెట్టుకున్న బంకులో అంతా పోయి బంకే మిగిలింది. పెళ్లి కోసం దాచుకున్న యాభై బస్తాలు కూడా నీట తడిచిపోయాయి. వాటిని గ్రామంలోని పునరావాస కేంద్రానికి ఇచ్చేశా. ఇలాంటి పరిస్థితుల్లో నా కొడుకు పెళ్లాగి పోతుందేమోనన్నా భయంగా ఉంది.

కళత్తూరును మోడల్ కాలనీ చేస్తాం : కలెక్టర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

'పడిన చోటే లేవాలనట్లు'గా ఊహించని వరదలో రూపురేఖలు కోల్పోయిన కళత్తూరు దళితవాడను మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డితో కలిసి కళత్తూరు దళితవాడలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న సహాయక చర్యలు పర్యవేక్షించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా



ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. సాధ్యమైనంత తొందరగా నష్టం అంచనా వేసి పరిహారం అందజేస్తామని పేర్కొన్నారు. తక్షణసాయంగా ఇంటికి 25కిలోల బియ్యం, రూ.3 వేలు, వారానికి సరిపడా నిత్యావసర సరుకులు అందిస్తున్నామని తెలిపారు. మేక/గొర్రెకు రూ.7500, ఆవుకు రూ.40 వేలు, గేదెకు రూ.50 వేలు పరిహారం ప్రకటించారు. అదేవిధంగా ఇళ్లల్లో పేరుకుపోయిన బురద, మరమ్మత్తులకు గాను రూ. 10 వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వరద కారణంగా ఇళ్ళన్నీ నెమ్మిక్కిన నేపథ్యంలో విద్యుత్ దీపాలకు మాత్రమే విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామనీ, పరిస్థితులు చక్కబడ్డాక గహాలకు అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామం పూర్తిగా కోలుకునేంతవరకు అన్ని సహాయ సహకారాలు కొనసాగుతాయని భరోసా ఇచ్చారు. శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిపిఎం శ్రేణుల సేవా కార్యక్రమాలు

శాశ్వత గృహ నిర్మాణం చేపట్టాలి: చింతామోహన్

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి



కళత్తూరు ఎస్సీ కాలనీని సురక్షిత ప్రాంతానికి మార్చాలని, శాశ్వత గృహ నిర్మాణం చేపట్టాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. గురువారం ముంపుకు గురైన కళత్తూరు ఎస్సీ కాలనీలో శుక్రవారం ఆయన పర్యటించారు. నిరాశ్రయులను పరామర్శించారు. అనంతరం శ్రీకాళహస్తిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైనర్ ఇరిగేషన్ శాఖకు బడ్జెట్ కేటాయించి, చెరువుల బాగోగులు పట్టించుకోవాలన్నారు.సీనియర్ నాయకులు బత్తెయ్యనాయుడు, నరేంద్రనాయుడు, సమీవుల్లా, కూలి రవికుమార్ పాల్గొన్నారు.



సామాన్లను శుభ్రం చేసుకుంటూ...



దళితులకు న్యాయం జరగాలి: దళిత సంఘాలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ శ్రీకాళహస్తి డివిజన్ కేవీబి పురం మండలం కళతూరు దళిత గ్రామం రాయల చెరువు తెగిపోవడంతో నీటి ముంపుకు గురై, సర్వస్వం కోల్పోయిన ప్రతి దళిత కుటుంబానికీ 5 లక్షల



ఎక్స్‌గ్రేషియా రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ప్రకటించి న్యాయం చేయాలని దళితసంఘాలు డిమాండ్ చేశాయి.. శుక్రవారం కళత్తూరును సందర్శించిన నాయకులు మాట్లాడుతూ ప్రతి కుటుంబం విలువైన సామాగ్రి తో పాటు తినే పాత్రలు, విద్యార్థిని విద్యార్థులు చదువుకునే పుస్తకాలు, మూగజీవాలు, కష్టపడి పండించుకున్న ధాన్యం పైసా పైసా కూడా పెట్టుకుని నిర్మించుకున్న ఇండ్లను కోల్పోయారన్నారు. ఆర్పిఐ దక్షిణ భారత అధ్యక్షులు పి అంజయ్య, టిటిడి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం అధ్యక్షులు ప్రసాదరావు, అంబేద్కర్ ఆర్మీ చీఫ్ డాక్టర్ గోపి, వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్, ఆమ్ ఆద్ పార్టీ జిల్లా కన్వీనర్ నీరుగట్టు నగేష్, తిరుపతి నుంచి దాదాపు ఒక లక్ష రూపాయలు విలువ చేసే దుప్పట్లు, చీరలు, టవల్సు బాధితులకు అందించారు. ఎస్ ఎల్ పురం యానాది కాలనీలోనూ బట్టలు అందించారు.

'సోషలిజమే' సక్సెస్ విజన్

- చంద్రబాబు 'పి4' పథకం ఫెయిల్యూర్
- 'సోషలిజం-మానవ వికాసం' సదస్సులో వివిఎస్ఆర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

చంద్రబాబునాయుడు విజన్ కంటే ముందే పుచ్చలపల్లి సుందరయ్య 1946వ సంవత్సరంలో దేశానికి స్వాతంత్ర్యం రాక ముందే 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' పేరుతో విజన్‌ను ప్రవేశపెట్టారని, చంద్రబాబు ఒక్కసారి ఈ పుస్తకం చదివి అమలు చేస్తే, ఈ రాష్ట్రం అందరికంటే ముందు పదేళ్లలో దేశంలోనే నంబర్‌వన్‌గా నిలుస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు.. అది కమ్యూనిస్టు విజన్ అన్నారు. ఆ విజన్ వదిలేసి పెట్టుబడిదారులకు కొమ్ముగాసే విజన్‌తో చంద్రబాబు ముందుకు వెళుతున్నారన్నారు. అసలు సిసలైన అభివృద్ధి కాముకులు కమ్యూనిస్టులేనని ఉద్ఘాటించారు. రష్యా విప్లవ దినోత్సవ స్ఫూర్తితో 'సోషలిజం- మానవ వికాసం' అంశంపై తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అధ్యక్షత వహించారు. సరిగ్గా 108 సంవత్సరాల క్రితం సోవియట్ విప్లవం వచ్చిందని, కార్మిక రాజ్యం ఏర్పడిందని ఇంతటి చారిత్రాత్మక దినాన్ని కమ్యూనిస్టు శ్రేణులు అర్థం చేసుకుని, పోరాటాలను ఉధృతం చేయాలన్నారు. ముఖ్య వక్తగా విచ్చేసిన వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు తీసుకొచ్చిన 'పి4 పథకం' ఫెయిలయ్యిందన్నారు. బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు ఏ పెట్టుబడిదారులూ ముందుకు రాలేదన్నారు. పెట్టుబడిదారులు లాభాపేక్షతో ఉంటారే తప్ప, వారికి మానవత్వం ఉండదన్నారు. పేదలను ఆదుకోవాలనే దృక్పథం వారికి ఉండకపోవడం వల్లనే బంగారు కుటుంబాలను వారు దత్తత తీసుకోలేదన్నారు. బంగారు కుటుంబాలను ఆదుకునేవారే అయితే, కార్మికులకు కనీస వేతనాలు ఇచ్చి, కొనుగోలు శక్తి పెంచేవారన్నారు. 1917లో రష్యాలో సోషలిస్టు వ్యవస్థ ఏర్పడడంతో అన్ని పార్టీలు 'సోషలిజం మా లక్ష్యం' అని ప్రకటించుకున్నాయని గుర్తు చేశారు. భారతదేశంలోనూ ఎక్కడ సోషలిస్టు ప్రభుత్వం ఏర్పడుతుందోనని భయపడి బ్రిటీష్‌వారు అప్పటి కాంగ్రెస్‌వారితో కలిసి స్వాతంత్ర్యాన్ని ప్రకటించారన్నారు. ఆ రోజుల్లో సోషలిజం అనేది ఆకర్షణగా మారిందన్నారు. రష్యాలో దున్నేవానికే భూమి, పరిశ్రమలపై కార్మికులకు హక్కు, విద్య, వైద్యం, ఉద్యోగాల కల్పన, ఆహారభద్రత సైతం సోషలిస్టు ప్రభుత్వం బాధ్యతగా అందించిందన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న వి.శ్రీనివాసరావు

కమ్యూనిస్టులకు 'పాలన' చేయడం రాదని ఎద్దేవా చేసిన పెట్టుబడిదారులు ముక్కున వేలేసుకునేలా అందరికీ ఉపాధి కల్పించి 1934లో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి మూసివేసేలా పాలన సాగించిందన్నారు. 'శక్తి కొద్దీ పని.. పనిని బట్టి ఫలితం' సోషలిస్ట్ వ్యవస్థ నినాదమన్నారు. అయితే శత్రువును అంచనా వేయడంలో చేసిన పొరబాట్ల వల్ల రష్యాలో సోషలిస్ట్ వ్యవస్థ కుప్పకూలిన వెంటనే 'సోషలిజానికి కాలం చెల్లింది' అని పెట్టుబడిదారులు సంబరపడ్డారన్నారు. అయితే రష్యా చేసిన తప్పిదాలతో గుణపాఠాలు నేర్చుకుంటూ, చైనా తన దేశ భౌతిక పరిస్థితులకు అనుగుణంగా కమ్యూనిస్టు దేశంగా నేడు అమెరికాను ఢీకొంటుందన్నారు. తాజాగా న్యూయార్క్ మేయర్‌గా మమ్దానీ ఘన విజయం ట్రంపుకు భంగపాటన్నారు. అమెరికాలో 63 శాతం యువత సోషలిస్టు ఆలోచనల వైపు మొగ్గుచూపుతున్నారన్నారు. ఇది మంచి పరిణామమన్నారు. జెఎన్‌యుఎస్‌యు ఎన్నికల్లో లెఫ్ట్ ప్యానల్ ఘన విజయాన్నీ ప్రస్తావించారు. కేరళలో 'జీరో పావర్టీ'ని నీతిఅయాగ్ ప్రకటించిందని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 'పి4 పథకం' ఫెయిలయ్యిందన్నారు. అమెరికాలో పేటెంట్ ఉండటం, చైనాలో లేకపోవడం వల్ల చైనా ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉందన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆర్థిక వ్యవస్థ రాజకీయ వ్యవస్థను శాసిస్తుందని, అదే సోషలిస్టు వ్యవస్థలో రాజకీయ వ్యవస్థ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తుందన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో కొనుగోలు శక్తి లేకపోవడం వల్ల సాఫ్ట్‌వేర్ రంగంలోనే ఉద్యోగ భద్రత లేదన్నారు. తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ పేరుతో మూడు నెలల్లో 20వేల మంది ఉద్యోగులు వీధినపడ్డారన్నారు. కొత్త సాఫ్ట్‌వేర్‌తో పోటీ పడుతూ నేర్చుకుంటే ఉద్యోగాలు నిలబడతాయని 'కాంక్లేవ్' సభలో తాజాగా చెప్పారని, అయితే ఏటా 2 లక్షల 30వేల మంది బిటెక్ చేసిన విద్యార్థులు ఉపాధి కోసం క్యూలైన్‌లో ఉంటున్నారన్నారు. ప్రభుత్వరంగ పరిరక్షణకు పోరాడింది కమ్యూనిస్టులేనన్నారు. విశాఖలో గూగుల్ ఏర్పాటుతో లక్షా 60వేల మందికి ఉద్యోగాలిస్తామని విద్యాశాఖ మంత్రి అబద్దాలు చెబుతున్నారని, వాస్తవానికి పదివేల మందికి కూడా ఉద్యోగాలు రావన్నారు. గతంలో భూములు సేకరించిన చోట ఇప్పటికీ పరిశ్రమలు రాక ఖాళీగా ఉన్నాయని, తాజాగా వేలాది ఎకరాలను పరిశ్రమల పేరుతో భూములను సేకరించడం శోచనీయమన్నారు. కడప స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తామనే డిమాండ్ ఉందని, విశాఖ స్టీలును నిర్వీర్యం చేసి మిట్టల్‌ను ప్రోత్సహిస్తోందన్నారు. 'సోషలిజయమే ప్రత్యామ్నాం' నినాదాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అసలైన అభివృద్ధి కాముకులు కమ్యూనిస్టులేనని అన్నారు. ఈ సదస్సులో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, ఎ.పుల్లయ్య, టి.సుబ్రమణ్యం, జిల్లా నాయకులు వేణు, సాయిలక్ష్మి, ఆర్.లక్ష్మి, జయచంద్ర, వెంకటేష్, గంధం మణి తదితరులు పాల్గొన్నారు.

నూతన పరిశోధనలు అభివృద్ధికి వెన్నెముక

జెఎన్‌యు ఛాన్సలర్ డా.వి.కె. సరస్వత్

ప్రజాశక్తి - క్యాంపస్

సరికొత్త నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు దేశ అభివృద్ధికి వెన్నెముకలా ఉంటాయని నీతి ఆయోగ్ సభ్యులు, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డాక్టర్ వికే. సరస్వత్ పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇన్నోవేషన్, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ సహకారంతో నీతి ఆయోగ్ సభ్యులు, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డాక్టర్ వి.కె. సరస్వత్ "పరిశోధన, ఆవిష్కరణ: ది ఇంజిన్ ఆఫ్ వికసిత్ భారత్ –2047" అనే అంశంపై సెనేట్ హాల్లో విశిష్ట ఉపన్యాస కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ 2047 నాటికి భారతదేశం అభివద్ధి చెందిన దేశంగా మారడానికి ఒక ఆకర్షణీయమైన రోడ్‌మ్యాప్‌ను ప్రతిపాదనలు తెలిపారు. సామాజిక సమ్మిళితం, నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ నిర్వహణ ,సాంకేతిక స్వావలంబనతో స్థిరమైన ఆర్థిక వద్ధిని మిళితం చేసేదే 'వికసిత భారత్' అని నిర్వచించారు. భారతదేశ పురోగతికి మద్దతునిచ్చే నాలుగు స్తంభాలను డాక్టర్ సరస్వత్ స్పష్టంగా వివరించారు.భారతదేశ డేటా సార్వభౌమత్వాన్ని కాపాడటానికి బలమైన డేటా-రక్షణ చట్టాలు ఉండాలని ఆయన కోరారు. అదే "భారతదేశ భవిష్యత్తు," అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎస్టీఎఫ్ కార్యదర్శి డా.టి. నారాయణరావు, మహిళా విశ్వవిద్యాలయం విసి ఆచార్య ఉమ, ఎస్వీయూ విసి ఆచార్య నరసింగరావు,




రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, రెక్టార్ ఆచార్య అప్పారావు, మాజీ ఉపకులపతి ఆచార్య మురళి పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో అంగప్రదక్షిణ టోకెన్లు

పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు
'డయల్ యువర్ ఈవో'లో అనిల్ కుమార్ సింఘాల్

ప్రజాశక్తి -తిరుమల



శ్రీవారి భక్తుల విజ్ఞప్తి మేరకు అంగప్రదక్షిణం టోకెన్ల జారీ చేయడానికి గతంలో ఉన్న డిప్ విధానం కాకుండా, ఆన్‌లైన్‌లో ముందు వచ్చిన వారికి ముందు అనే పద్ధతిలో వచ్చే ఫిబ్రవరి నుండి కేటాయించనున్నట్లు టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ చెప్పారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నవంబరు 17 నుండి 25వ తేదీ వరకు కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం అన్నారు. భక్తుల సౌకర్యార్థం దాదాపు రూ.25 కోట్లతో తిరుమలలోని ఆళ్వార్ ట్యాంక్ గెస్ట్ హౌస్ నుండి గోగర్భం డ్యాం సర్కిల్ వరకు పర్మినెంట్ షెల్టర్, క్యూ లైన్, స్టీల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి, టాయిలెట్స్ నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. భక్తుల సూచనల మేరకు శ్రీవారి దర్శనాలకు సంబంధించి శ్రీవాణి, ఇతర దర్శన టోకెన్లు జారీ చేసే విధానంపై పరిశీలించి నివేదిక సమర్పించేందుకు టీటీడీ బోర్డు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటాం. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలలో రూ.750 కోట్ల శ్రీవాణి ట్రస్ట్ నిధులతో 5 వేల భజన మందిరాల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. తిరుమల అటవీ ప్రాంతంలో రానున్న పదేళ్లలో జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు, పచ్చదనాన్ని పెంపొందించేందుకు టీటీడీ బోర్డు నిర్ణయం తీసుకుంది. భక్తుల రద్దీకి తగ్గట్లుగా అన్నప్రసాదాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోని వెంకటపాలెంలో గల వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆలయ ప్రాకారం, కల్యాణోత్సవ మండపం, రాజగోపురం తదితర అభివద్ధి పనులు ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి.శ్రీవారి దర్శనానికి దళారులను నమ్మి మోసపోయినట్లు ఇటీవల హైదరాబాద్‌కు చెందిన కొందరు భక్తులు ఫిర్యాదు చేశారని, ఇలాంటి ఫిర్యాదులు తరచూ వస్తున్నాయని, భక్తులు శ్రీవారి దర్శనానికి దళారుల మాటలు విని మోసపోవద్దని, ఆన్‌లైన్ ద్వారానే దర్శన టోకెన్లు పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వి.వీరబ్రహ్మం, సీవీఎస్వో కే.వి.మురళీకష్ణ, సీఈ టి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు తిరుపతిలో పవన్ కళ్యాణ్ పర్యటన

ఎర్రచందనం పరిరక్షణపై అధికారులతో సమావేశం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తిరుపతి జిల్లా పరిధిలోని మామండూరు అటవీ ప్రాంతాన్ని, అటవీ శాఖకు చెందిన స్టేట్ ఆర్ట్ ఆఫ్ గోడౌన్స్ ఫర్ రెడ్ శాండర్స్ గోదాములను, ఎర్రచందనం పరిరక్షణపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరేట్లో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు అధికారిక పర్యటన ప్రకటన ద్వారా తెలిపారు. ప్రకృతి అందాలకు నిలవైన మామండూరు అటవీ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చడానికి అధికారుల పర్యటన అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆ ప్రాంతానికి వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంటుంది. ప్రకృతి అందాలను ప్రకృతి ప్రేమికులకు మరింత దగ్గరగా తీసుకురావాలని ప్రభుత్వం ఇప్పటికే ఈ ప్రాంతం పర్యాటకంగా అభివద్ధి చేయడానికి ప్రత్యేక ప్రతిపాదనలు అటవీ శాఖ ఆధ్వర్యంలో చేశారు. శేషాచలం నుండి అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్స్, అటవీ శాఖ సంయుక్తంగా దాడులు నిర్వహించి టన్నులకొద్దీ ఎర్రచందనం స్వాధీనం చేసుకొని కేంద్రీయ గోదాములో నిల్వ ఉంచారు. ఇటీవల ఆన్లైన్ టెండర్ ద్వారా కొన్ని టన్నులు విక్రయం చేసినట్లు తెలుస్తోంది. శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం అక్రమ రవాణా పూర్తిగా నియంత్రించడానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అటవీశాఖ సంబంధిత శాఖల అధికారులతో కీలకమైన సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నారు. అలానే వన్యప్రాణుల నుండి మానవాళికి ఎటువంటి ఆపద జరగకుండా ముఖ్యంగా చిరుతపులులు, ఏనుగులు వలన ఏర్పడే ఘటనలకు సంబంధించి టెక్నాలజీతో కూడిన నియంత్రణ జరిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు అధికార వర్గాల నుండి సమాచారం. నూతన టెక్నాలజీతో ఏనుగుల రాకను ముందుగానే పసిగట్టి, గజ ట్రాక్టర్ ద్వారా ముందస్తుగానే శబ్దాలు చేయడం, సమీప గ్రామాల ప్రజలకు సమాచారం చేరవేయడం జరుగుతుంది. ప్రస్తుతం కల్లూరు, పులిచెర్ల సమీపంలో ఏనుగుల దాడుల నివారణకు ఈ టెక్నాలజీని ప్రయోగాత్మకంగా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు నిచ్చారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 20/2016 కేసులో ఈ ముద్దాయి తిరుపతి జిల్లా నాగపట్ల ఈస్ట్ బీట్, చామల రేంజ్ పరిధిలో అరెస్టయ్యాడు. ఈ వ్యక్తి తమిళనాడు, వేలూరు జిల్లా కు చెందిన ఎస్ గుణశేఖర్ కాగా ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ. 6లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు అతనిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించారు. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది ఒక హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు ఎస్పీ పి. శ్రీనివాస్ తెలిపారు. కోర్టు సిబ్బందిని ఆయన అభినందించారు.



పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



తుపాను సహాయక చర్యల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: వెంకటగిరి, 1వ వార్డు, బంగారుపేటలో శుక్రవారం జరిగిన చేనేత కార్మికులకు తుపాను సహాయక సరుకుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పేదవాడి సొంతింటి కల నెరవేర్చి, చేనేతలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. గత వైసీపీ పాలనలో అన్ని రంగాల ప్రజలు దోపిడీకి గురయ్యారన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులను వివరించారు. తుపాను ప్రభావిత కుటుంబాలకు అండగా నిలవడంతో ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసీ చైర్మన్, పట్టణ అధ్యక్షులు, చేనేత డైరెక్టర్, రూరల్, డక్కిలి మండల అధ్యక్షులు, తిరుపతి పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి, రాష్ట్ర, నియోజకవర్గం అనుబంధ కమిటీ సభ్యులు, జనసేన పట్టణ అధ్యక్షులు, సర్కిల్ ఇన్స్పెక్టర్, సిహెచ్‌సి హాస్పిటల్ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చేనేతలకు అండగా కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: కూటమి ప్రభుత్వం చేనేతల అభివృద్ధికి కృషి చేస్తోందని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. ఇటీవల వర్షాలకు చేనేత కార్మికుల పనులు ఆగిపోవడంతో వారి ఇబ్బందిని గుర్తించి ప్రభుత్వం పుత్తూరు రూరల్ మండలం గొల్లపల్లిలో 75 కుటుంబాలకు 50 కే. జీ ల బియ్యం, 1 కే జీ కందిపప్పు, 1 కే. జీ చక్కెర, కే. జీ ఉల్లిపాయలు, కే. జీ బంగాళా దుంపలు, కే. జీ పామాయిల్ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పంపిణీ చేశారు. 2 వ విడత గా మరో 50 మందికి పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, రూరల్ పట్టణ అధ్యక్షులు బాలాజీ, ఎంపీడీవో శ్రీదేవి, మాజీ ఎంపీటీసీ సభ్యులు, చేనేత కార్మికులు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అమరాలో డయాబెటిస్ హెల్త్ ప్యాకేజ్ ప్రారంభం


ప్యాకేజీని ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - రేణిగుంట: వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా తిరుపతి అమరా హాస్పిటల్‌లో రూ. 799 డయాబెటిస్ హెల్త్ చెకప్ ప్యాకేజీను ప్రారంభించారు. బయోఇసియోమీటర్, బైద్రెక్షనల్ డాప్లర్ విత్ ఫుట్ స్కాన్ మెషిన్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా. రవి రాజు మాట్లాడుతూ మధుమేహ నియంత్రణలో అవగాహన, పరీక్షలు చేయించుకోవడం, జీవనశైలి మార్పులు అత్యంత కీలకమని తెలిపారు. డా. మీనాక్షి మాట్లాడుతూ, అమరా హాస్పిటల్ తీసుకున్న ఈ ముందడుగు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమానికి ప్రధాన అతిథిగా డా. పి.రవి రాజు, అప్పా అధ్యక్షులు ఇంటర్నేషనల్ వాక్స్ అసోసియేషన్ వారు హాజరయ్యారు. అలాగే డా. రవి (మెడికల్ సూపరింటెండెంట్, అన్నగారి హాస్పిటల్), డా. మీనాక్షి, డా. వరుణ్, డా. లోకేశ్, డా. వాసుదేవ రెడ్డి, డా. రమ్య సాయి, భాగ్యలక్ష్మి (చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, అమరా హాస్పిటల్)తో పాటు ఇతర వైద్య బృందం, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయ నిధి ద్వారా 38 మందికి మంజూరైన 21 లక్షల 79 వేల 806 రూపాయల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు రెండవ పట్టణంలోని నర్సింగరావు పేట, అంగనవాడి కేంద్రంలో శుక్రవారం లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎల్లారు గోపాలకృష్ణ అధికార పర్యటన కార్యక్రమాల్లో భాగంగా అంగన్వాడి కేంద్రానికి లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ దాతృత్వంతో ప్లేట్లు, గ్లాసులు, వాశిలి రాజేశ్వరమ్మ జ్ఞాపకార్థం వారి సహోదరి డాక్టర్ సుగుణమ్మ టీవీ అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ అక్కున రమణయ్య, కార్యదర్శి ఆర్.రవి చంద్రారెడ్డి, ట్రెజరర్ పి.వీరేంద్రనాథ్, ఏలూరు అరుణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధి పథకాలకు శ్రీకారం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు నియోజకవర్గం, బుచ్చినాయుడు కండ్రిగ మండలం, తలారి వెట్టు గ్రామపంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నియోజకవర్గ టిడిపి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి, రాష్ట్ర యాదవ సంఘం చైర్మన్ నరసింహ యాదవ్ శుక్రవారం తలారి వెట్టు గ్రామంలోని డ్రైనేజ్ నిర్మాణం, హై స్కూల్ మరుగుదొడ్లు, పంచాయతీ బోరు మోటార్‌తోపాటు ఇతర అభివృద్ధి పనులకు మొత్తం 20 లక్షల రూపాయల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల ప్రారంభానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ యాదవ్, వేణుగోపాలపురం ఎంపీటీసీ మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వేదికకు పలు సమస్యలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం ఆమె నివాసం వద్ద ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్నాలు వీధి, గవర్నమెంట్ పాఠశాలలో సరిపడా మరుగుదొడ్లు, వంటగది లేక ఇబ్బంది పడుతున్నారని వినతి సమర్పించారు. మొత్తం 55 అర్జీలు రాగా వాటిలో ఇంటి స్థలాల కొరకు 28, పెన్షన్ కొరకు 18, డ్రైనేజీ సమస్యల కొరకు 5, స్మశానం కొరకు -2, నగరంలోని వివిధ ప్రాంతాల సమస్యలపై అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, నాయకులు సురా సుధాకర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఏఎంసీ ప్రమాణ స్వీకారం వాయిదా

ప్రజాశక్తి - నాయుడుపేట: ఈనెల 9 తేదీ ఆదివారం జరగవలసిన ఏఎంసీ ప్రమాణస్వీకార మహోత్సవం 12వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ఉయ్యాల ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలియజేశారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సిఎంఆర్ ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మధురానగర్‌కు చెందిన భ్రమరాంబకు ఒకటిన్నర లక్ష రూపాయల చెక్కు, గణేష్‌కు నలభై ఆరువేల యాభై ఒక్క రూపాయల చెక్కు, ఎల్ బి నగర్ కు చెందిన ప్రేమ్ కుమార్‌కు లక్షా డెబ్బై ఐదు వేల రెండు వందల ఒక్క రూపాయల చెక్కు, మణికంఠకు యాభై వేల రూపాయల చెక్కును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాజా రెడ్డి, ఆముదాల వెంకటేష్, జానకిరామ రెడ్డి, రాజేష్ అచ్చారి, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్య పరిష్కారానికి కృషి


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శివజ్యోతి నగర్ నుంచి జీవకోనకు వెళ్లే రోడ్డును మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది శుక్రవారం ఉదయం మూసివేసేందుకు ప్రయత్నించారు. ఈ ప్రయత్నాన్ని స్థానికులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని సందర్శించారు. రోడ్డు మూసివేస్తే తాము చాలా దూరం చుట్టుకుని వెళ్లాల్సి ఉంటుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా తాము రోడ్డు మూసేందుకు చర్యలు చేపట్టినట్లు వర్క్ ఇన్స్పెక్టర్ కరుణ ఎమ్మెల్యేకి తెలిపారు. కోర్టు తీర్పుపై అప్పీల్‌కు వెళ్ళే అవకాశం ఉందా అని ఎమ్మెల్యే ఆరా తీయగా, కమిషనర్ మౌర్య విదేశీ పర్యటనలో ఉన్నారని ఆమె రాగానే సాధ్యాసాధ్యాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే స్థానికులకు తెలిపారు. అయితే శివజ్యోతి నగర్ నుంచి జీవకోనకు వెళ్లేందుకు కరుమారియమ్మ గుడి రోడ్డు ఉన్నా అది ఇరుకుగా ఉందని ఎమ్మెల్యే కి ఆ మార్గాన్ని చూపించి స్థానికులు వివరించారు. నిత్యం వందలాది మంది వినియోగించే రోడ్డును వాడుకునేందుకు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలించి న్యాయం చేసేందుకు తన వంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

నవోదయ విద్యాలయ ఏర్పాటుకు ఎంపీ వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి పార్లమెంట్ పరిధిలో జవహర్ నవోదయ విద్యాలయ స్థాపనకు తిరుపతి పార్లమెంట్ సభ్యుడు మద్దిల గురుమూర్తి లేఖకు కేంద్ర విద్యా శాఖ సానుకూలంగా స్పందించిది. ఈ మేరకు కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి పంపిన లేఖలో ఎంపీ ప్రతిపాదనను గుర్తిస్తూ, నవోదయ విద్యాలయ సమితితో చర్చించి విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం, ఒక జిల్లాలో ఇప్పటికే నవోదయ విద్యాలయ ఉన్నచోట కొత్తగా స్థాపించడం సాధ్యం కాదని మంత్రి పేర్కొన్నారు. అయితే 1986-87లోనే తిరుపతి పార్లమెంటు పరిదిలోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో నవోదయ విద్యాలయ స్థాపించారని పేర్కొన్నారు. ఇటీవల తిరుపతి జిల్లా ప్రత్యేకంగా ఏర్పడిన నేపథ్యంలో తాజా గణాంకాలను పరిశీలించి తిరుపతి జిల్లాలో కొత్త నవోదయ విద్యాలయ స్థాపనకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని తెలిపారు. ఎంపీ కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు..

ప్రజా సమస్యలు పరిష్కరించండి : నాని

ప్రజాశక్తి - చంద్రగిరి : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చంద్రగిరి మండలంలో వచ్చిన ఫిర్యాదులపై ఎమ్మార్వో కార్యాలయంలో అధికారులతో శుక్రవారం ఎమ్మెల్యే నాని సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవిన్యూ కార్యాలయం వద్ద అసంపూర్తిగా నిలిచిన కార్యాలయ భవనాన్ని పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రజా సమస్యలపై అధికారులు తక్షణం స్పందించి పరిష్కారం చూపాలని తెలిపారు. ఆర్టీసీ అధికారులపై ఫిర్యాదులు రావడంతో పుంగనూరు, తిరుపతి డిపో మేనేజర్లతో ఎమ్మెల్యే భేటీ అయ్యారు. పల్లెవెలుగు బస్సులు పుంగనూరు, తిరుపతి జాతీయ రహదారిలో వెళుతూన్నాయని వాటిని సర్వీస్ రోడ్లలో ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

బిఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా పెనుమూరు గురప్ప



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు బెహెన్ మాయావతి ఆదేశాల మేరకు సెంటర్ కో-ఆర్డినేటర్ల ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా రిటైర్డ్ జడ్జి పెనుమూరు గురప్పను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ శుక్రవారం ప్రకటించారు. ఆయన జిల్లా జడ్జిగా పదవీ విరమణ చేశారు. అనంతరం బిఎస్పీలో చేరారు. రాష్ట్ర కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా, జోనల్ కో-ఆర్డినేటర్‌గా, క్రమశిక్షణా సంఘం ఛైర్మన్‌గా వ్యవహరించి పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా నియమితులైన పెనుమూరు గురప్ప ఏడేళ్లుగా పార్టీ నిర్మాణం కోసం నిజాయితీగా, అంకితభావంతో ఎన్నో బహిరంగ సభలు, ప్రాంతీయ సదస్సులు, క్యాడర్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. గురప్పకు తిరుపతి జిల్లా బిఎస్పి అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది జయచంద్ర అభినందనలు తెలియజేశారు.

ఏపి ఎన్జీఓ తాలూకా అధ్యక్షుడుగా ఈశ్వరయ్య ఏకగ్రీవ ఎన్నిక



ప్రజాశక్తి - చంద్రగిరి: ఏపిఎన్జీఓ చంద్రగిరి తాలూకా అధ్యక్షుడుగా ఎంపిహెచ్ఎగా విధులు నిర్వహిస్తున్న సి.ఈశ్వరయ్యను, చంద్రగిరి తాలూకా యూనిట్ కార్యదర్శిగా స్వర్ణలతను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. స్థానిక కొత్తపేటలోని ఎన్జీఓ హోమ్‌లో శుక్రవారం ఏపిఎన్జిఓ తాలూకా యూనిట్ ఎన్నికలు నిర్వహించారు. పుత్తూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి ఎన్నికల అధికారి, కార్యదర్శి టి.కె.రాజీవ్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి, అడాక్ కమిటీ ట్రెజరర్ బి.లలితకుమార్ అబ్జర్వర్ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. తిరుపతి జిల్లా అడాక్ కమిటీ చైర్మన్ ఎస్.సురేష్‌బాబు, కన్వీనర్ సి.రఘులు నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయించారు.

ఆవులను అనారోగ్యం బారి నుండి రక్షించాలి


గ్రామస్తులతో వైసిపి యువ నాయకులు చంద్రారెడ్డి

ప్రజాశక్తి-కోట: ఆవులను అనారోగ్యం బారి నుండి రక్షించాలని నెల్లూరు పల్లి, కొత్త పాలెం పంచాయతీకి చెందిన వైసిపి యువ నాయకులు చంద్రారెడ్డి కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం కోట మండలం కొత్తపాళెం గ్రామంలో ఆవులకు వింత చర్మవ్యాధులు సోకుతున్నాయని, ఆవుల శరీరమంతా నల్లని మచ్చలతో అనారోగ్యానికి గురై వాటి ఆరోగ్యం పూర్తిగా క్షీణించి ఇటీవలే రెండు ఆవులు ఒక లేగదూడ చనిపోయాయని నేదురుమల్లి హరిష్ చంద్రా రెడ్డి తెలిపారు. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. దీనిపై పశు వైద్య అధికారులు వెంటనే స్పందించి ఆవులకు మందులు,ఇంజక్షన్‌లు వంటి చర్యలు చేపట్టి ఆవులను అనారోగ్య భారీ నుండి కాపాడాలని పాడి ఆవుల రైతులు వైసీపీ యువ నాయకులు నేదురుమల్లి హరిష్ రెడ్డి దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ సమస్యపై వెంటనే స్పందించిన హరిష్ చంద్రా రెడ్డి విద్యానగర్ పశు వైద్యాధికారి సిరాజ్ ఖాన్‌తో మాట్లాడి ఆవులకు సోకిన వ్యాధిని గుర్తించి టీకాలు, మందులను ఇవ్వాలని సూచించారు. ఆవుల చికిత్స,టీకాల కొరకు అవసరమైతే తమ వంతు రుణసాయం అందిస్తామని తెలిపారు. అధికారులు స్పందించి వైద్య సహాయం అందిస్తామని తెలిపారు.అలాగే గ్రామంలో విచ్చలవిడిగా రోడ్ల మీద అడ్డంగా వాహన దారులకు ఇబ్బందులు కలిగిస్తున్న ఆవుల సమస్య పరిష్కారానికై అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హరిష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులు ఆయనకు ధన్యవాదములు తెలిపారు.

జీతాల బకాయిలు చెల్లించండి

ప్రజాశక్తి - సత్యవేడు : తమకు బకాయి పడ్డ నాలుగు నెలల జీతాల కోసం సత్యవేడు మండల కేంద్రం సామాజిక ఆరోగ్య కేంద్రంలోని పారిశుద్ధ్య కార్మికులు నిరసనకు దిగారు. నాలుగు నెలలుగా కాంట్రాక్టర్ జీతాలు ఇవ్వడం లేదంటూ ఆవేదన వ్యక్తపరిచారు. తమ కాంట్రాక్టర్ ఎవరో కూడా తెలియదని, కటుంబం గడవక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. పనిభారం కూడా ఎక్కువగా ఉందని, కనీస రక్షణ చర్యలు లేవని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తమ జీతభత్యాలు, శానిటేషన్ రసాయనాలు ఇప్పించకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షాహుల్‌కు వినతిపత్రం సమర్పించారు. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మెలుగు రమేష్ పారిశుధ్య కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేత, బీవుల, శివ, దేవా తదితరులు పాల్గొన్నారు.

పవన్ రావాలి : సిపిఎం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జిల్లా పర్యటనకు విచేస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కళత్తూరును సందర్శించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్ శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతంలో ఉన్న కళత్తూరు దళితవాడను మిట్ట ప్రాంతాలకు తరలించడానికీ, ప్రతి కుటుంబానికి 5 సెంట్లు ఇంటి స్థలం, 10 లక్షల రూపాయలు ఇంటి నిర్మాణానికి, రెండు ఎకరాలు సాగు భూమి ఇచ్చి శాశ్వత పరిష్కారం చేయడానికి పవన్ నేరుగా పర్యటిస్తే బాగుంటుందన్నారు. పెండింగ్‌లో ఫారెస్ట్, రెవెన్యూ శాఖల మధ్య భూ వివాదాన్ని కూడా పరిష్కారం చేసి దళితులకు న్యాయం చేసే విధంగా తగు చర్యలు తీసుకోవడానికి విజ్ఞప్తి చేశారు.

నిస్వార్థ సేవకు డీఈఓ ప్రశంస

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో గత 30 సంవత్సరాలుగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా వందలాది మంది విద్యార్థినీ, విద్యార్థులను సామాజిక సేవలో భాగస్వామ్యం చేస్తూ, నిస్వార్థంగా సేవలు అందిస్తున్న జిల్లా రోవర్ కార్యాలయ కమీషనర్ టి. రమేష్ బాబు ను జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్. కుమార్ శుక్రవారం ప్రశంసించారు. తిరుచానూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఫౌండేషన్ డే ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చీఫ్ కమీషనర్, జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్. కుమార్ పాల్గొన్నారు.

న్యాయం అందరికీ సమానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: న్యాయం అందరికీ సమానంగా అందాలని సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి పేర్కొన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని నిర్వహించారు. సమాజంలోని బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సేవలందించేందుకు1987లో లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్‌ను తీసుకొచ్చామన్నారు. జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

బోగల కృష్ణకు నివాళి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు నియోజకవర్గం, బి ఎన్ కండ్రిగ మండల కేంద్రం, ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు బోగల కృష్ణ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి ఆయనకు నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయమందించారు.

శ్రీరామలో నూతన భవన నిర్మాణానికి భూమిపూజ


నూతన భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల ఆవరణలో నూతన భవన నిర్మాణానికి శుక్రవారం కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి దంపతులు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రామిరెడ్డి, డైరెక్టర్ అరవింద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కల్పించడానికి ఎప్పుడు నూతన ఆలోచనలతో ముందుకెళతామని, ఆ చర్యలలో భాగంగా విద్యార్థులకు ఇప్పుడున్న సౌకర్యాలతో పాటుగా మరింత మెరుగైన సౌకర్యాలను కల్పించడానికి ఈ నూతన భవన నిర్మాణం చేపట్టినట్లు స్పష్టం చేశారు. కళాశాలకు ఎన్బీఏ, అటానమస్ హోదా లభించడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ఈ నేపథ్యంలో వచ్చే అకాడమిక్ సంవత్సరాలను దృష్టిలో పెట్టుకొని నూతన భవన నిర్మాణం చేపట్టమన్నారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వాసు, కళాశాల విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మోక్షం



ప్రజాశక్తి -ఏర్పేడు : ఇటీవల వర్షాలకు పంగూరు హైస్కూల్ నుండి రాక్ మాన్ పరిశ్రమ వరకు రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆర్ అండ్ బి డిప్యూటీ సూపరింటెండెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆదేశాల మేరకు ఏర్పేడు ఆర్ అండ్ బి వర్క్ ఇన్స్పెక్టర్ మురగయ్య నాయుడు శుక్రవారం జెసిపిల సహాయంతో గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టారు.

ఇంటి వద్దకే ముఖ్యమంత్రి సహాయనిధి : బొజ్జల బృందమ్మ



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): మండలంలోని 5 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను వారి ఇంటివద్దకె వెళ్లి శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ చేతుల మీదగా శుక్రవారం అందజేశారు. ఈ ఐదు మంది లబ్ధిదారుల్లో గుర్రప్ప నాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన సి.మునెమ్మకు రూ.34,946, కనుపర్తి గ్రామానికి చెందిన సి.వంశీ రమణకు రూ.1,28,496, చిన్న సింగమాల గ్రామానికి చెందిన యం.కృష్ణయ్యకు రూ.47,377, కొణతనేరి గ్రామానికి చెందిన యం. నిర్మలకు రూ.30,028, పూడి గ్రామానికి చెందిన యం. స్వాతికి రూ.55,786 మొత్తం ఐదు మంది లబ్ధిదారులకు ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని కష్టాల్లో ఉన్నప్పటికీ సహాయ నిధి కింద నగదును అందించడం చూస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల పక్షపాతిగా ఉన్నారనే సంగతి ఇట్టే అర్థమవుతుందని అన్నారు. మహిళలకు కూడా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రభుత్వం ప్రవేశపెడుతుందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంను అభివృద్ధి పథంలో నడిపించడానికి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఎంతో కష్టపడి పని చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల అధ్యక్షులు రావిళ్ళ మునిరాజు నాయుడు, టి.డి.పి నాయకులు కన్నలి ప్రతాప్ రెడ్డి, కొన్నలి రమేష్, గుర్రప్ప, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంజి ఇండోర్ స్టేడియం ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని తిమ్మినాయుడు పాలెం కాటన్ మిల్ రోడ్డు మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంజి ఇండోర్ స్టేడియంను శుక్రవారం తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మానసిక ఉల్లాసాన్ని ఇచ్చేది క్రీడలే అని, విద్యతో పాటుగా క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ సందర్భంగా ఎంజి ఇండోర్ స్టేడియం యాజమాన్యం వెంకటేష్, మహేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు ఎంచుకొని అందులో శిక్షణ పొంది జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ఆసక్తిని గమనించి శిక్షణ ఇప్పించాలన్నారు. అలాగే పిల్లలు పెద్దలు వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరు తమకు నచ్చిన క్రీడను ఎంచుకొని ప్రతిరోజు ఆడడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు ఆర్ఆర్ యాదవ్, చిరంజీవి యాదవ్, చంద్ర యాదవ్ వెంకీ ఇండోర్ స్టేడియం నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ అక్రమాలపై విచారణ చేయాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ఆవరణలో గ్యాస్ సిలిండర్లు ఉంచి వంటాది కార్యక్రమాలు చేయడం వలన ప్రమాదం పొంచి ఉందని, దీనిపై ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ ను ప్రశ్నిస్తే తమకు ఎలాంటి సంబంధం లేదని, అనధికారిక క్యాంటీన్ నడుపుతున్న వారిపై జిల్లా కలెక్టర్ విచారణ కమిటీని నియమించి చర్యలు తీసుకోవాలని తిరుపతి నగర కాంగ్రెస్ అధ్యక్షులు గౌడపేర చిట్టిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రసూతి వైద్యశాలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంభూపాల్ రెడ్డి, తమటం వెంకట నరసింహులుతో కలిసి చిట్టిబాబు పరిశీలించారు. గర్భిణీలు, బాలింతలు, నవజాత శిశువులు ఉండే ప్రదేశం వద్ద అనధికారికంగా గ్యాస్ సిలిండర్లను ఉంచి సుధీర్ అనే వ్యక్తి క్యాంటీన్ నడుపుతున్నారని, దీనిపై సూపరింటెండెంట్ ను అడిగితే తమకేమీ సంబంధం లేనట్లు మాట్లాడడం దేనికి సంకేతం అన్నారు. వారి ప్రాంగణంలో వారికి తెలియకుండా అనధికారిక క్యాంటీన్ నడపడం ఏంటని ప్రశ్నించారు. ఏదేని ప్రమాదం జరిగితే ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని ప్రసూతి ఆసుపత్రిలో జరుగుతున్న అనధికారిక కార్యక్రమాలపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఇవే కాకుండా గర్భిణీలకు, బాలింతలకు వైద్యం అందించాల్సిన వైద్యులు గైర్హాజరవుతున్నారని, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆసుపత్రిలో కంటే తన సొంత క్లినిక్ కు ఎక్కువ సమయం కేటాయించి గడుపుతున్నట్లు పలు ఫిర్యాదులు అందయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మల్లికార్జున, శివ బాలాజీ, గొడుగు చింత గోపి, కృష్ణమూర్తి, జ్యోతిశ్వర్ నాయక్ పాల్గొన్నారు.

మాధవమాలలో కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి -ఏర్పేడు : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాధవ మాల గ్రామపంచాయతీలో వైయస్సార్ సిపి నాయకులు ఇంటింటికి వెళ్లి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బల్కీస్ బేగం, కరిముల్లా, ముని కృష్ణారెడ్డి, మునిరత్నం రెడ్డి, భాస్కర్ రెడ్డి, చంద్రమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

కల్కి ట్రస్టు ఆక్రమిత అటవీ భూమిని స్వాధీనం చేసుకోండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): భక్తి ముసుగులో కల్కి ట్రస్టు నిర్వాహకులు అటవీ భూమిని ఆక్రమించి కల్కి ఆశ్రమాన్ని నిర్మించారని, వారు ఆక్రమించిన అంజూరు అటవీ భూమిని అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని. భారత హేతువాద సంఘం అధ్యక్షులు నార్నే వెంకటసుబ్బయ్య విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్కి ట్రస్ట్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకొని, పేద దళిత వర్గాలకు ఇచ్చిన డీకేటీ పట్టా భూములను వారిని లోబరుచుకుని ఆశ్రమంలో కలిపేసుకున్నాడని, ఈ ఆశ్రమం ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు లేవని గుర్తు చేశారు. సిపిఐ పార్టీ నేత పెంచలయ్య పాల్గొన్నారు.

శ్రీశైలం దర్శనం.. ప్రత్యేక ప్యాకేజి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: కార్తీక మాసాన్ని పురస్కరించు కొని ఆంధ్రప్రదేశ్ టూరిజం డిపార్ట్మెంట్ వినియోగదా రులకు అనేక ఆఫర్లను ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటిం చింది. దీనిలో భాగంగా తిరుపతి నుండి మహానంది మీదుగా శ్రీశైలం వరకు స్పెషల్ నాన్ ఎసి మినీ బస్ సౌకర్యాలను కల్పించింది. ఈ మేరకు శుక్రవారం ఏపీ టూరిజం యాజమాన్యం మీడియాతో మాట్లాడారు. తిరుపతి నుండి శ్రీశైలిని పెద్దలకు రూ. 4310లు చెల్లిస్తే భక్తులకు అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తామని తెలిపారు. భోజనం, వసతి సౌకర్యాలు కూడా కల్పిస్తున్న ట్లు చెప్పారు. 9, 16 తేదీల్లో తిరుపతి నుండి శ్రీశైలం కు ఏపీ టూరిజం వారి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. వివరాలకు 9848007033, 984880209నంబర్లను సంప్రదించాన్నారు.

యూరియా పంపిణీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బి.ఎన్ కండ్రిగ మండలం, తలారి వెట్టులో సత్యవేడు టీడీపీ ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి పలువురు రైతులకు శుక్రవారం యూరియా బస్తాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్, తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు నరసింహ యాదవ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

తిరుపతి రోడ్లపై ఆకతాయిల హల్చల్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి రోడ్లపై గురువారం రాత్రి ఆకతాయిలు హల్చల్ చేశారు. స్థానికుల కథనం మేరకు 38 వ వార్డ్ కనక భూషణ్ లేఔట్‌లో గురువారం అర్ధరాత్రి కొంతమంది యువకులు పెద్దగా కేకలు వేస్తూ వీధుల్లో వీరంగం సృష్టించారు. పార్క్ చేసిన కార్లు, ఆటోల అద్దాలు పగలగొట్టి, బీరు బాటిళ్లను నేలపై విసిరికొట్టారు. ఈ చర్యలతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. యువకులు మద్యం మత్తులో ఇలా చేశారా, గంజాయి వినియోగం వల్ల అలా వ్యవహరించారా, లేదా ఎవరి పైనన్నా కక్ష కట్టి ఉద్దేశం పూర్వకంగా ఇలా వ్యవహరించారా తెలియని పరిస్థితి. పోలీసులు రాత్రి వేళలో గస్తీ ముమ్మరం చేసి, ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పొట్టకూటికొచ్చి.. విద్యుదాఘాతానికి బలి


ఓలేటి ఇంద్రబాబు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-ఏర్పేడు: పొట్టకూటికి వచ్చి పొలంలో పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై యువకుడు దుర్మరణం పాలైన దుర్ఘటన మండలంలోని చెల్లూరు పంటపొలాల్లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు...కృష్ణా జిల్లా కోడూరు మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఓలేటి ఇంద్రబాబు (21) డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఇంట్లో కాళీగా ఉండటం ఇష్టం లేక పలువురు స్థానికులతో పాటు చెల్లూరు సమీపంలో వరినాట్లు వేసేందుకు ఇటీవల వచ్చాడు. ఈ క్రమంలో ఓ రైతు పొలంలో శుక్రవారం వరినాట్లు వేసేందుకు వరినారును మోసుకెళ్తున్న ఇంద్రబాబుకు పొలంలోని విద్యుత్తు తీగలు తగలడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. జీవనాధారం కోసం తమతో వలసొచ్చిన. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపై డ్రైనేజీ నీరు.. దుర్గంధం వెదజల్లుతున్న తీరు



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక మున్సిపాలిటీ పరిధి, గేట్ పుత్తూరు, ఆనంబట్టు రోడ్డుపై డ్రైనేజీ కాలువలో మురికి నీరు పొంగిపొర్లుతోంది. దీంతో రెండు రోజులుగా దుర్వాసన భరించలేక స్థానికులు ముక్కు మూసుకుంటున్న పరిస్థితి ఏర్పడింది. గతంలో ఎన్నోసార్లు మున్సిపల్ శాఖ వారికి ఫిర్యాదు చేసినా, ఫలితం లేదని స్థానికు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వస్తే ఇదే పరిస్థితి ఎదురవుతోందిని తెలిపారు. మురికి నీరు నిలవకుండా శాశ్వత పరిష్కారం చేయాలని కోరుతున్నారు. విష జ్వరాలు, డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ఇప్పటికైనా మున్సిపల్ శాఖ వారు స్పందించి చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.

కలెక్టర్‌ను కలిసిన కొట్టే సాయి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ను శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మ కర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముక్కంటి తీర్ధ ప్రసాదాలు అంద జేశారు. ఆలయ అభివృద్ధిపై చర్చించారు. అదేవిధంగా ఎస్పీ సుబ్బారాయుడును కూడా మర్యాదపూర్వకంగా కలిసి ఆలయ భద్రతా అంశాలపై చర్చించారు.

తిరుపతిలో 9న ఫెన్సింగ్ పోటీలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతిలో 9వ తేదీన ఫెన్సింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు, పోటీలో గెలిచినవారు ఈస్ట్ గోదావరిలో 11వ తేదీ నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనే అవకాశం కలుగుతుందని నిర్వహకురాలు గీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా జి ఎస్ ఎల్ మెడికల్ కాలేజ్‌లో జరగబోయే 12 వ ఎపి స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ పురుషులు, బాలికలు, మహిళలు ఫెన్సింగ్ చాంపియన్షిప్-2025-26కు ఉమ్మడి చిత్తూరు జిల్లా ఫెన్సింగ్ టీం ఎంపికలు ఈనెల తొమ్మిదో తేదీ ఆదివారం ఉదయం 9గంటల నుండి ఫెన్సింగ్ ట్రైనింగ్ సెంటర్ ఫస్ట్ ఫ్లోర్ శ్రీదేవి కాంప్లెక్స్ తిలక్ రోడ్ జరుగుతాయని, చిత్తూర్ జిల్లాకు చెందిన ఫెన్సింగ్ క్రీడాకారులు అక్టోబర్ 31 నాటికి 14 సంవత్సరాల వయస్సు ఉన్న వారు ఈ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి గుర్తింపు కార్డు, 18 సంవత్సరాలు నిండిన వారు గతంలో ఆడినఫెన్సింగ్ సర్టిఫికేట్, బర్త్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9573144231 నంబరును సంప్రదించాలని కోరారు.

జిల్లాలో వెయ్యి మెగా వాట్ల థర్మల్ ప్లాంట్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తిరుపతి జిల్లాలో వేదంతి పవర్ గుర్తింపు కింద వెయ్యి మెగా వాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ మీనాక్షి ఎనర్జీ 2023లో కొనుగోలు చేసి, రెండేళ్లలో ప్లాంట్ ను పూర్తి చేసి కార్యచరణ సామర్థ్యాన్ని అందుబాటులో తీసుకొచ్చామని వేదాంత లిమిటెడ్ పవర్ సిఈఓ రాజేందర్ సింగ్ అహూజా తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ రంగంలో థర్మల్ శక్తి కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఏపీలో నాణ్యమైన సేవలు అందించామని, అలాగే ఛత్తీస్‌గఢ్ సింగితారాయ్‌లోని 1,200 మెగావాట్ల వేదాంత లిమిటెడ్ ఛత్తీస్‌గఢ్ థర్మల్ పవర్ ప్లాంట్ (గతంలో అథీనా పవర్), 2022లో సగం పూర్తయిన ప్రాజెక్టుగా కొనుగోలు చేసింది. ఆగస్టు 2025లో దాని మొదటి 600 మెగావాట్ల యూనిట్‌ను ప్రారంభించింది. పంజాబ్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా వ్యాప్తంగా దాదాపు 5జిడబ్ల్యూ మర్చంట్ పవర్ (ఐపిపి ఆస్తులు)తో సహ, వేదాంత తన వ్యాపారాల అంతటా దాదాపు 12 జిఎం థర్మల్ విద్యుత్ సామర్థ్యాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. అదే స్ఫూర్తితో ప్రస్తుతం తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎన్ పీడీసీఎల్) టెండర్‌లో అత్యధిక వాటాను వేదాంత మీనాక్షి ఎనర్జీకి 300 మెగావాట్లు, వేదాంత లిమిటెడ్ దక్కించుకుందని వెల్లడించారు. తమ వ్యాపార కలాపాలను మరింత విస్తతం చేసి, ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తామని తెలిపారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE TIRUPATI
O.S.No. 41/2024
A.M. Subramanyam ... **Plaintiff**
Vs.
V.Umapathi ...**Defendant**
Summons to the Defendant
V. Umapathi, S/o. Ramaiah Business, D.No. 18-1-596A, Bhavani Nagar, Tirupati Cell No. 9704270938
Where as the plaintiff filed above suit against you on the basis of demand promissory note and case is posted to 18.11.2025 for your appearnce you shall appear in person or thorugh advocate on 18.11.2025 at 10.30am. If you failed to appear the case will be decided in your absence
V. DHANANJAYA VARMA
Advocate, Tirupati

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) GUDURU
I.P.NO.50/2025
దారిశెట్టి రామయ్య ... **పిటిషనర్**
V/s
1. అరికట్ల బాలకృష్ణ
2. కత్తి ప్రసాద్
3. చలంచర్ల ప్రసాద్
4. ఏటూరి పుల్లారెడ్డి
5. చల్లంచర్ల శంకరయ్య ....రెస్పాండెంట్స్

జనరల్ నోటీసు
పై నెంబరు ఐపిలో పిటిషనర్ తనని ఇన్‌సాల్వెంట్‌గా తీర్మానించమని కోరుతూ పైన తెలిపిన కోర్టులో డెటార్‌లో ఐ.పి. దాఖలు చేసియున్నందున సదరు డెటార్ ఐ.పి. విషయమై ఎవ్వరికైన ఆక్షేపణలు ఉన్న యెడల తేది 24.11.2025 ఉదయం 10:00 గంటలకు పైన తెలిపిన కోర్టులో హాజరై తెలుపుకోవలసినదిగా ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.
ఇట్లు
యస్. శ్రీనివాసులు, B.A, B.L.,
పిటిషనర్ తరపు న్యాయవాది
గూడూరు.

గీతావైభవ మహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో 23న జరుగునున్న శ్రీకృష్ణ గీతా వైభవ మహోత్సవం 2025 పోస్టర్ ను ఉప కులపతి ఆచార్య జిఎస్ఆర్ కృష్ణమూర్తి, అకాడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల, ఇతర డీన్స్‌తో కలిపి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిద కళాశాలల విద్యార్థులు పాల్గొనవలసిందిగా తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి ఒక్కరికి ప్రమాణ పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. వివరాలకు 8639451323, 9036910821 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా ఆచార్య ఎన్జీరంగా జయంతి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో ఆచార్య ఎన్జీరంగా 125వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం రెడ్డి శేఖర్, అధ్యాపకులు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సుమతి, శాస్త్రవేత్తలు సిబ్బంది నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల దత్తత గ్రామం చంద్రగిరి మండలం, దోర్నకంబాల పంచాయతీకి చెందిన రైతులను సత్కరించారు.

పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం



ప్రజాశక్తి -ఏర్పేడు : సదాశివపురంలో పశువులకు రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం ఏర్పాటు చేయడం జరిగినదని ఎండి పుత్తూరు పశువైద్యాధికారిణి డాక్టర్ శిల్పా రెడ్డి తెలిపారు. గ్రామంలోని పశువులకు పిడుదుల మందు పిచికారీ, దూడలకు నట్టల నివారణ మందు తాపించడం, తిరిగి పొర్లే పశువులకు వైద్య చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. సునీత(ఏ డి రేణిగుంట), పశువైద్యులు డాక్టర్.రెడ్డెప్పరెడ్డి, డాక్టర్.కృష్ణ మోహన్ రెడ్డి, డాక్టర్ చిరంజీవి, డాక్టర్.మోహన కుమారి, డాక్టర్ స్రవంతి వీణ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్పీవీ వ్యాక్సిన్‌తో కేన్సర్ నివారణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మహిళా అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.హైమావతి చిన్న బజారు వీధిలోని గవర్నమెంట్ బాలికల పాఠశాల బాలికలకు హెచ్ పి వి వ్యాక్సిన్ ద్వారా గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌ను నివారించవచ్చు అని అంశం పైన అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హెచ్ పి వి కి వ్యతిరేకంగా వ్యాక్సిన్ చిన్నతనంలో ఇవ్వడం వల్ల భవిష్యత్తులో క్యాన్సర్ రాకుండా నివారించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్ర రీసెర్చ్ అసిస్టెంట్స్ డాక్టర్ ఇంద్రాణి, ప్రీతి, పాఠశాల హెడ్ మాస్టర్ విజయ తదితరులు పాల్గొన్నారు.

బ్రెస్ట్ కేన్సర్ పై అవగాహన



ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా టాటా ట్రస్ట్ స్వీకార్ సహకారంతో శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ లోని మానవ హక్కులు, సామాజిక అభివృద్ధి విభాగం స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్, ఆకాంక్ష ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం క్యాన్సర్ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథి రిజిస్ట్రార్ భూపతి నాయుడు జండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ అంటే చాలామంది భయపడతారని క్యాన్సర్ వచ్చిన తర్వాత బాధపడే దానికన్నా ముందుగా ఈ టాటా ట్రస్ట్ లాంటి సంస్థలు నిర్వహించే క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఉచితంగా పరీక్షలు చేయించుకుని మొదటి దశలోనే గుర్తిస్తే నివారణకు అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల విభాగం అధ్యాపకులు రంజిత్ కుమార్, రవిబాబు, శ్రీధర్, కల్చరల్ కోఆర్డినేటర్ పత్తిపాటి వివేక్, విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, అశోక్ పాల్గొన్నారు.

వందేమాతర గీతం దేశ స్ఫూర్తిని నింపింది

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దేశ ఐక్యత స్ఫూర్తిని నింపే విధంగా, సమస్త భారతావని ప్రజానీకాన్ని ఐక్యత నినాదంతో ఏకం చేసిన బకీమ్ చంద్ర చటర్జీ రాసిన గేయం వందేమాతర గీతం అని శ్రీనివాస స్కూల్ కరస్పాండెంట్ సుబ్రమణ్యం రాజు పేర్కొన్నారు. శుక్రవారం వందేమాతర గీతం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీలో ఉన్న పాఠశాల నుండి బిటిఆర్ కాలనీ మీదుగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని దేశభక్తి నినాదాలు చేశారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బియన్ కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 150వ వందేమాతరం జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రమణయ్య, తహశీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో వెంకటరత్నమ్మ, విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం, సబ్ ఇన్స్పెక్టర్ హరిప్రసాద్‌లు ఈ కార్యక్రమాలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య నరసింగరావు, రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడుల ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం ఎదుట వేదేమాతం గేయాలపన కార్యక్రమా నిర్వహించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఇందిర ప్రియదర్శిని ఆడిటోరియంలో వందేమాతరం గీతాన్ని ఆలాపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని, వివిధ విభాగాల డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, శ్రీ సరస్వతీ శిశు మందిరం పాఠశాలలో పాఠశాల కార్యదర్శి, తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బండి శ్యాంసుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్), సంచాలిత సమితి సహకారదర్శి యస్ వి యల్ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో వందేమాతరం గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 150 సంవత్సరాల వందేమాతరం జయంతి సంబరాలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మన్యం నరసింహులు, ఎన్‌సిసి అధికారి డాక్టర్ ఎం. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రాపురం : ఆర్‌సి పురంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వందేమాతరం గేయాలాపన నిర్వహించారు. శుక్రవారం మండలంలోని మిట్టూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలలో ఐసిడిఎస్, విద్యశాఖ సంయుక్తంగా ఎంఈఓ మార్కండేయ నాయుడు, ఐసిడిఎస్ సూపర్వైజర్ మనీలా ఉపాధ్యాయులు విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి వందేమాతరం గేయాలపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్ కుమార్ అరుణ, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలం, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కార్యాలయ పరిపాలనాధికారి



సి.శ్రీనివాసులు అధ్యక్షతన వందేమాతరం జాతీయ గేయం ఆలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి శ్రీనివాసులు, తహశీల్దార్ ఇక్బాల్, ఎంఈఓలు నజీమ్ అలీ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : వందేమాతరం 150 సంవత్సరాల జ్ఞాపకార్థం ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పోలీసుల మద్దతుతో రేణిగుంటలో సామూహిక గీతాలాపన నిర్వహించారు. ఈ సందర్భంగా దేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయడాన్ని ప్రోత్సహించాలని తెలిపారు.శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ సి.ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో వందేమాతరం గీతాన్ని కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఆలపించారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో భరత మాత విగ్రహం వద్ద జాతీయ గీతం "వందే మాతరం" 150 సంవత్సరాల వేడుకలను నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి ఆధ్వర్యంలో వర్సిటీలోని ప్రకాశం భవనం ఎదుట వందేమాతరం గీతాన్ని ఘనంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాసరాజు, సూపరిండెంట్ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం ప్రిన్సిపల్ ఆర్.బి సరళ ఆధ్వర్యంలో వందేమాతరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శుక్రవారం వందేమాతరం గీతాలాపన కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. శ్రీప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు రాజనాల, రవి, సుబ్బరాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు సిద్ధార్ధ కళాశాల చైర్మన్ డాక్టర్ అశోక్ రాజు ఆధ్వర్యంలో, పుత్తూరు సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం వందేమాతరం గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు డా. బి.మధు, డా.ఎం.జనార్ధన్ రాజు తదితరులు పాల్గొన్నారు

ప్రజాశక్తి -ఏర్పేడు : మండలంలోని బండారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వందేమాతరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి చంద్రగిరి: ఏ.రంగంపేట కూడలి వద్ద ప్రిన్సిపాల్ కే.సుబ్రమణ్యం పిటిసి, కళ్యాణి డ్యామ్, తిరుపతి, వైస్ ప్రిన్సిపాల్, పిటిసి సిబ్బంది, విద్యార్థులు వందేమాతరం గీతం ఆలపించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటి: తిరుపతి పరిధిలోని నార్త్ సెక్షన్ లో 33 కె.వి, అలిపిరి 33 కె.వి, ఇస్కాన్ సబ్ స్టేషన్ లో అన్ని 33./,11 కె. వీ. అన్ని ఫీడర్లు, 33 11 కెవి మున్ రెడ్డి నగర్ ఫీడర్, 33 /11 కేవీ రవీంద్ర నగర్ ఎస్.ఎస్, 33/ 11 కేవీ భవాని నగర్ ఎస్.ఎస్, 11 కే.వీ కొర్లగుంట ఫీడర్, 33/11 కె.వి దామినేడు ఎస్.ఎస్. 11 కెవి కృష్ణ తేజ ఫీడర్, 33 11 కెవి. ఏల మండేయమ్ ఎస్. ఎస్. 33 లెవెన్ కె వి ప్రాంతాలలో ట్రీ కటింగ్, 33/11 గాజులమండ్యామ్ ఎస్ ఎస్,11 కె. వి. ఎల్ టి. లైనులు, ట్రీ కటింగ్ , మెయింటెనెన్స్, మరమ్మత్తులు కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ స్వరూపకం ఉంటుందని తిరుపతి అర్బన్ ఈఈ గంగాధరం ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఎస్వీ మెడికల్ కాలేజ్, వెటర్నరీ హాస్పిటల్, డాక్టర్స్ క్వార్టర్స్, బర్డ్స్ హాస్పిటల్, పద్మావతి కాలేజ్ స్విమ్స్ హాస్పిటల్, ఎమ్.సి.ఆర్ కాలనీ, అంబేద్కర్ కాలనీ, గాలి వీధి, మంచాల వీధి వీధి అనంత వీధి, త్యాగరాజ నగర్, సింగాలగుంట, వరదరాజ నగర్ హౌసింగ్ బోర్డ్ కాలనీ ఎన్జీవో కాలనీ రామచంద్ర నగర్ సప్తగిరి నగర్, కేటీ రోడ్, ఇస్కాన్ రోడ్, అన్నారావు సర్కిల్, దామినేడు ఇందిరమ్మ ఇల్లులు, గరుడాద్రి నగర్, లెనిన్ నగర్, ప్రగతి నగర్ తెలుగు నగర్, పి.వి నగర్ ఎస్వీ నగర్, కోర్లగుంట, అశోక్ నగర్ అబ్బన్న కాలనీ, శివ జ్యోతి నగర్ భూపాల్ నగర్ విజయపురం క్రాంతి నగర్ తదితర పరిసర ప్రాంతాల వినియోగ దారులు సహకరించాలని కోరారు.

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట సబ్ డివిజన్, ఎల్లమన్నెం, తుకీవాకం, కరకంబాడి, రేణిగుంట, ఎర్రం రెడ్డిపాలెం, గాజులమండ్యం, సబ్ స్టేషన్లు మరమ్మత్తులు, విద్యుత్ తీగలు చెట్లకు తగలకుండా తీసివేయడం వంటి పనుల నిర్వహణ ఉన్నందున, శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డిఈ రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

కేన్సర్ రోగులకు మద్దతు ఇవ్వండి

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ కాన్సర్ అవగాహన దినోత్సవం, ఊపిరితిత్తుల కాన్సర్ అవగాహన వారోత్సవాలలో భాగంగా శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సి.ప్రకాష్ బాబు అధ్యక్షతన విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుపతి శ్రీవేంకటేశ్వర ఇస్టిట్యూట్ ఆఫ్ కాన్సర్ కేర్, అడ్వాన్స్డ్ రీసెర్చ్ మెడికల్ డైరెక్టర్ (ఎస్విఐసిసిఏఆర్) డా. ప్రశాంత్ మాట్లాడుతూ విద్యార్థులు కాన్సర్ రోగం పట్ల అవగాహన పెంపొందించుకొని, ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వీకర్ మార్కెటింగ్ మేనేజర్ రమేష్, అధ్యాపకులు, డా. సి. ఎల్. చెన్నా రెడ్డి, వై. చిన్ని కేశవులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించకుంటే చర్యలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని బస్టాండ్ ఆవరణలో శుక్రవారం సబ్ ఇన్స్పెక్టర్ హరి ప్రసాద్, ఏఎస్ఐ నారాయణమూర్తి తనిఖీలు నిర్వహించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. సబ్ ఇన్స్పెక్టర్ హరి ప్రసాద్ మాట్లాడుతూ బస్టాండ్ ఆవరణలో ట్రాఫిక్ అప్పటికప్పుడు క్లియర్ చేయాలని తెలిపారు. బస్టాండ్లో ఆటోలు, ఇతర వాహనాలు నిలుపరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించనివారికి జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రమేష్, సురేష్, మణి తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డే సందర్భంగా పుత్తూరు స్కౌట్స్ అండ్ గైడ్స్ సుమారు 300 మంది విద్యార్థులతో భారీ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ ర్యాలీని పుత్తూరు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ స్కౌట్స్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ సేవా భావం అలవర్చుకోవాలని తెలిపారు. గైడ్ కెప్టెన్ రెడ్డి రాణి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ అశోక్ కుమార్, రేంజర్ లీడర్స్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించండి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఇటీవల రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మండలి ఆధ్వర్యంలో పీజీ మొదటి సంవత్సరం ప్రవేశాల రెండో విడత అడ్మిషన్లు పూర్తిచేసినా కూడా మిగిలిపోయిన రెగ్యులర్, సెల్ ఫైనాన్స్ కోర్సులలోని సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా పూర్తి చేయాలని వర్సిటీ రెక్టర్ ఆచార్య అప్పారావుకి ఏపీ స్టూడెంట్స్ జేఏసీ జిల్లా అధ్యక్షులు శ్రీధర్ వినతిపత్రం ఇచ్చారు.ఎస్వీయూలో ఖాళీగా ఉన్న రెగ్యులర్ సెల్ ఫైనాన్స్ కోర్సుల సీట్లను వెంట నే స్పాట్ అడ్మిషన్లు నిర్వహించి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమా లు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నేతలు తిరుమలేష్, సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో న్యాయ సేవా దినోత్సవం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు కోర్టు ప్రాంగణంలో శుక్రవారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సేవా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి గాయత్రి మాట్లాడుతూ లోక్ అదాలత్ ఆవిర్భావం గురించి వివరించారు. కక్షి దారులు లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రో నోట్ కేసుల గురించి ఉచిత న్యాయ సలహాల గురించి తెలియచేశారు.

సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): మండలంలోని రౌతు సూరమాల గ్రామంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పర్యటించినప్పుడు గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు దాదాపు 11 లక్షల రూపాయలతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు.

ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - రామచంద్రపురం: ప్రకృతి వ్యవసాయ పంటల ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని మండల టీడీపీ అధ్యక్షుడు మేకల తిరుమల రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని టీవీ సఫార్లలో బయో ఇన్పుట్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ రసాయన ఎరువుల వాడకానికి స్వస్తిపలికి, సేంద్రియ ఎరువులతో కూడిన ప్రకృతి వ్యవసాయ పంటలను సాగు చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన జీవ ఉత్ప్రే రకాలు ఘనజీవామృతం, ద్రవ జీవమృతం, వంటివి బి ఆర్ సి కేంద్రాలలో లభిస్తాయని తెలిపారు.